క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన రెడ్‌క్రాస్ సొసైటీ బాధ్యులు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ బాధ్యులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): కరీంనగర్ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన పమేలా సత్పతిని గురువారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బాధ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ బాధ్యులు కేశవరెడ్డి, రాధాకృష్ణ, శ్రీహరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డంప్‌యార్డ్ తనిఖీ

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని డంప్‌యార్డ్‌ను నగరపాలకసంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ గురువారం తనిఖీ చేశారు. ఇటీవల తరచూ డంప్‌యార్డ్‌లో మంటలు చెలరేగడం, పొగ వ్యాపిస్తుండడంతో పరిశీలించారు. మంటలు, పొగ వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఎన్నికల ప్రక్రియపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న శివకిరణ్

కరీంనగర్‌సిటీ: నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం విద్యార్థులకు ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ టి.శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో అసిస్టెంట్ స్వీప్ మోడల్ ఆఫీసర్ శివకిరణ్ హాజరై 1950 టోల్ ఫ్రీ నంబర్ గురించి వివరించారు. ఓటరు ఐడి డౌన్‌లోడ్ చేసుకునే విధానం, సీవిజిల్ యాప్, దానిలో ఫిర్యాదులు చేసే విధానం గురించి తెలిపారు. ప్రతిఒక్కరూ ఓటు వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీవోడబ్ల్యూ టి.లావణ్య, సుజాత, అరుణ, వంశీ, విద్యార్థినులు పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం



జెండావిష్కరణ చేస్తున్న నాయకులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): డీవైఎఫ్ఐ 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని మంకమ్మతోటలో గల కార్యాలయం ఎదుట జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరేశ్, తిరుపతిలు జెండా ఆవిష్కరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అరవింద్, ప్రేమ్, విజయ్, రాజేందర్, క్రాంతి, రాజు, మహ్మద్ రియాజ్, తిరుపతి, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

పవర్‌కట్ ప్రాంతాలు



కొత్తపల్లి: కరీంనగర్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఇంప్రూవ్‌మెంట్ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 11కేవీ మహాశక్తి ఆలయం ఫీడర్ పరిధిలోని విద్యానగర్, సంతోష్‌నగర్, బాలాజీ సూపర్‌మార్కెట్, సెయింట్‌జాన్స్ స్కూల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2 ఏడీఈ ఎం.సుధీర్‌కుమార్ తెలిపారు.





వైభవంగా మహాభిషేకం.. వాహన సేవలు



కరీంనగర్‌కల్చరల్: నగరంలోని యజ్ఞవరాహస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న 37వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం సుప్రభాతం, కొలువు, తోమాల సేవ, హనుమంత వాహన సేవ కన్నుల పండువగా జరిగింది. పవిత్ర నదీజలాలతో మహాభిషేకం నిర్వహించారు. సాయంత్రం దోలోత్సవాన్ని నేత్రపర్వంగా జరిపారు. ముత్యాలపందిరి, వాహనంలో శ్రీవారు భక్తులకు దర్శనమిస్తూ కనువిందు చేశారు. ఈ కార్యక్రమంలో సర్వవైదిక సంస్థానం ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాద్, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం సూర్యప్రభావాహనం, పూలంగి, తిరుప్పావడ సేవలు, మహాశాంతి హోమం సహస్రదీపాలంకరణ, గజ వాహన సేవలు జరగనున్నాయి.

మంత్రి గంగుల సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరికలు



మంత్రి గంగుల కమలాకర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న యువకులు

కరీంనగర్: వైఎస్‌ఆర్‌టీపీ యూత్ టౌన్ ప్రెసిడెంట్ తోట కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో 100 మంది యువకులు గురువారం రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి మంత్రి గంగుల కమలాకర్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో సతీశ్, శ్రావణ్, హరికృష్ణ, సంతోష్ ,రవి, వెంకట్, సాగర్, సాయి, ప్రసాద్‌లున్నారు. మేయర్ వై.సునీల్‌రావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'గంగుల'కు బాసటగా ఉంటాం

కరీంనగర్ అసెంబ్లీ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మంత్రి గంగుల కమలాకర్‌కు మద్దతుగా గురువారం పలు కుల సంఘాలు, ప్రజా సంఘాలు బాసటగా నిలుస్తూ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని తీర్మానాలు చేసుకున్నారు. కరీంనగర్ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న కమలాకర్‌ను మరోసారి గెలిపించుకుంటామని భగత్‌నగర్‌లోని పెద్దమ్మ ఆలయంలో ముదిరాజ్ సంఘం నాయకులు, భగత్‌నగర్ రెడ్డిసంఘం, మున్నూరు కాపు సంఘం నాయకులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రెడ్డవేని మధు, పిట్టల రవీందర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం ముసుగులో తెలంగాణ లూటీ



మాట్లాడుతున్న రెహమాన్

కరీంనగర్‌కార్పొరేషన్: కాళేశ్వరం ప్రాజెక్ట్ ముసుగులో తెలంగాణ ప్రజలను కేసీఆర్ లూటీ చేశారని యువజన కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్ అన్నారు. గురువారం నగరంలోని డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ వల్ల కేవలం కేసీఆర్ కుటుంబం మాత్రమే లాభపడిందన్నారు. ప్రాజెక్ట్ వ్యయం వల్ల భావితరాలు అప్పులు, వడ్డీలు కట్టాల్సిన దుస్థితి ఏర్పడిందని విమర్శించారు. వ్యవసాయ ప్రయోజనం కన్నా కాళేశ్వరం ప్రాజెక్ట్ వ్యయం ఎక్కువగా ఉందని, ఇది ఆచరణీయం కాదన్నారు. ప్రాజెక్టు అవినీతి కారణంగా 2040 వరకు రాష్ట్రంలోని అన్ని కుటుంబాలు ఏటా రూ.31,500 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ మహమ్మద్ అమీర్, మైనార్టీ కరీంనగర్‌రూరల్ అధ్యక్షుడు శైబాజుల్లాఖాన్, ఇర్ఫాన్, జాకీ తదితరులు పాల్గొన్నారు.

మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు చేయాలి



మాట్లాడుతున్న నాగమణి

కరీంనగర్: మహిళా రిజర్వేషన్ బిల్లును 2024 సంవత్సరంలోనే అమలు చేయాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి కొనేటి నాగమణి డిమాండ్ చేశారు. గురువారం సంఘ కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు కందుకూరు కృష్ణవేణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. సమాజంలో సగభాగంలో ఉన్న మహిళలకు 50 శాతం సీట్లు కేటాయించాలని, 33 శాతం రిజర్వేషన్‌ను వెంటనే అమలు చేయాలని అన్నారు. మహిళలపై హత్యలు, అత్యాచారాలు, వేధింపులు రోజురోజుకు పెరుగుతున్నా ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షురాలు ద్యావా అన్నపూర్ణ, సహాయ కార్యదర్శి సరాల లావణ్య ,జిల్లా కమిటీ సభ్యులు రజిత, స్వరూప, రోజా తదితరులు పాల్గొన్నారు.

5న విశ్వకర్మ మహాజన బహిరంగ సభ



సభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

విద్యానగర్(కరీంనగర్): హైదరాబాద్‌లోని ఉప్పల్ బగాయత్‌లో ఈనెల 5న తెలంగాణ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మహాజన బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండోజు లక్ష్మయ్య, సలహాదారుడు వేములవాడ ద్రోణాచారి తెలిపారు. గురువారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో మహాజన బహిరంగ సభ పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలో 25లక్షల వరకు జనాభా ఉన్న విశ్వకర్మలు స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు అయినా సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్నారు. ఎన్నికలప్పుడు విశ్వకర్మలను ఓటు బ్యాంకుగా ఉపయోగించుకుంటున్న రాజకీయ పార్టీలు తర్వాత పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిర్వహిస్తున్న బహిరంగ సభకు జిల్లాలోని విశ్వకర్మలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా నాయకులు శ్రీరామోజు రవీంద్రాచారి, తిప్పారపు శ్రీనివాస్, గొట్టిముక్కుల ఉమారాణి, కదార్ల శివప్రసాద్, కాయితోజు పవన్‌కుమార్, వంగల శ్రీధర్, కట్ట జగన్, గద్దె సత్యనారాయణ, ఊకంటి ఓంకార్, హరిహరా చారి, ఉదారపు మారుతి, రాధాకిషన్, నాగసముద్రం శ్రీనివాస్, ముత్తోజు ప్రభాకర్, నర్సింహాచారి తదితరులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ ఐక్యవేదిక నగర కమిటీ నియామకం



నియామకమైన కమిటీ

విద్యానగర్(కరీంనగర్): తెలంగాణ నాయీబ్రాహ్మణ ఐక్యవేదిక నగర నూతన కమిటీని గురువారం నాయీబ్రాహ్మణ విద్యార్థి వసతి గృహంలో జరిగిన సమావేశంలో నియమించారు. నగర అధ్యక్షుడిగా గడ్డం వీరేందర్, ప్రధాన కార్యదర్శిగా శ్రీరాముల రమేశ్, ఉపాధ్యక్షుడిగా నడిగొట్టు భిక్షపతి, సహాయ కార్యదర్శిగా నారాయణదాస్ శివ, కార్యదర్శులుగా గడ్డం పవన్, మిడిదొడ్డ రవిలు నియామకమయ్యారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఉపాధ్యక్షుడు అవుదుర్తి విజయకుమార్, ప్రధాన కార్యదర్శి సింగిరాల వెంకటస్వామి, రాష్ట్ర ముఖ్య సలహాదారు శ్రీరాములు బాలసురేందర్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గర్శకుర్తి శంకర్, కరీంనగర్ జిల్లా అధ్యక్షులు జంపాల నర్సయ్య, నాయకులు జనగామ సురేశ్, మిడిదొడ్డి కుమార్, బొనకుర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సత్తా శ్రీనివాస్‌కు నివాళి



కరీంనగర్: లోక్‌సత్తా శ్రీనివాస్ జయంతి సందర్భంగా గురువారం కరీంనగర్‌లోని సంఘ కార్యాలయంలో లోక్‌సత్తా ఉద్యమ సంస్థ బాధ్యులు, వినియోగదారుల మండలి బాధ్యులు, కరీంనగర్ ఫిలిం సొసైటీ కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు.ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు చంద్ర ప్రభాకర్, ప్రకాశ్‌హోల్లా, సయ్యద్ ముజఫర్, వెంకటేశ్వర్‌రావు, కోల రామచంద్రారెడ్డి, గాజోజు నాగభూషణం, రఘురాం, గంగాధర్, మహేందర్‌రెడ్డి, మనోహరాచారి, తదితరులు పాల్గొన్నారు.

తనిఖీలు ముమ్మరం



చింతకుంట వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న కొత్తపల్లి ఎస్సై చంద్రశేఖర్

కొత్తపల్లి: కరీంనగర్ శివారులో పోలీసుల తనిఖీలు ముమ్మరమయ్యాయి. కరీంనగర్ సీపీగా అభిషేక్ మహంతి బాధ్యతలు స్వీకరించిన రోజు నుంచే తనిఖీలను తీవ్రతరం చేశారు. కొత్తపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని లాడ్జీలు, ఫంక్షన్ హాళ్లల్లో తనిఖీలు చేపట్టిన పోలీసులు ప్రతిరోజూ ప్రధాన రహదారులపై వాహనాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ముఖ్యంగా కరీంనగర్–వేములవాడ ప్రధాన రహదారిపై చింతకుంట, కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారిపై రేకుర్తి స్టేజీ వద్ద వాహనాలను తనిఖీలు చేస్తున్నారు. కరీంనగర్‌రూరల్ ఏసీపీ టి.కరుణాకర్ ఆధ్వర్యంలో రేకుర్తి, చింతకుంట స్టేజీల వద్ద గురువారం రాత్రి బీఎస్ఎఫ్ బలగాలు, పోలీసులతో పాటు డాగ్ స్క్వాడ్‌తో వాహనాలను తనిఖీ చేశారు. అనుమానం వచ్చిన వారి వివరాలు తెలుసుకుంటున్నారు. కొత్తపల్లి ఎస్సై బి.చంద్రశేఖర్, పోలీసుల సిబ్బంది పాల్గొన్నారు.

'ఓట్లడిగే అర్హత బీఆర్‌ఎస్‌కు లేదు'

కరీంనగర్‌కార్పొరేషన్: కరీంనగర్ రూరల్ మండలం, బొమ్మకల్ గ్రామాల్లో ఓట్లడిగే అర్హత బీఆర్‌ఎస్‌కు లేదని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ రూరల్ మండల అధ్యక్షుడు షాహబాజ్ ఉల్లాఖాన్ అన్నారు. గురువారం డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇప్పటివరకు బొమ్మకల్, కరీంనగర్‌రూరల్ మండల గ్రామాలను బీఆర్‌ఎస్ పట్టించుకోలేదన్నారు. బొమ్మకల్ సర్పంచ్ పురుమల్ల శ్రీనివాస్‌కు కాంగ్రెస్ టికెట్ వస్తుందనే ప్రచారంతో ఇప్పుడు ఈ ప్రాంతంపై ప్రేమ చూపిస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో మైనార్టీ నాయకులు అలీం ఉద్దీన్, అబ్దుల్ సలీం, మహమ్మద్ ఇర్ఫాన్, అహ్మద్ హుస్సేన్, అబ్దుల్ ఖాదర్, సిరాజ్ పాల్గొన్నారు.

డీసీసీ కార్యదర్శిగా అంజయ్య

కొత్తపల్లి: కొత్తపలి మండలం బావుపేట గ్రామానికి చెందిన దుర్గం అంజయ్యను కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శిగా నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ గురువారం ఉత్తర్వులు వెలువరించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని సూచించారు.

బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా చింతం శ్రీనివాస్



శ్రీనివాస్

కరీంనగర్‌టౌన్: బీజేపీ జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యుడిగా తిమ్మాపూర్ మండలం మక్తపెల్లికి చెందిన చింతం శ్రీనివాస్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి నియామక ఉత్తర్వులు జారీ చేశారని బీజేపీ మండల అధ్యక్షుడు సుగుర్తి జగదీశ్వరాచారి తెలిపారు. పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా పనిచేసి, ప్రధాని మోదీ ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని నియామకపు ప్రకటనలో సూచించారు. కాగా తన నియామకానికి సహకరించిన మండల, జిల్లా నాయకత్వానికి చింతం శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

'గంగుల' కుటుంబసభ్యుల ప్రచారం



దుర్శేడ్‌లో ప్రచారం చేస్తున్న మంత్రి కమలాకర్ సోదరుడు సుధాకర్



దుర్శేడ్‌లో ఇంటింటా ప్రచారంలో కరపత్రాలు అందిస్తున్న మంత్రి కమలాకర్ సతీమణి రజిత

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం దుర్శేడ్, నల్లగుంటపల్లి, తాహెర్‌కొండాపూర్, బహదూర్‌ఖాన్‌పేట గ్రామాల్లో గురువారం మంత్రి గంగుల కమలాకర్ కుటుంబసభ్యులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దుర్శేడ్, నల్లగుంటపల్లిలో మంత్రి కమలాకర్ సతీమణి రజిత, సోదరుడు సుధాకర్–శారద దంపతులు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి బీఆర్‌ఎస్‌కు ఓటేయాలని కోరుతూ ఇంటింటా ప్రచారం చేశారు. గ్రామాల్లో మంత్రి కమలాకర్ చేసిన అభివృద్ధి పనులను చూసి నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కాగా మంత్రి సతీమణి రజిత ప్రచారంలో భాగంగా ఓ వృద్ధురాలు కారు గుర్తుకు బదులుగా చేతి గుర్తుకే ఓటేయ్యాలని నినాదాలు చేయడంతో నవ్వులు విరబూశాయి. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గాజుల వెంకటమ్మ, ఉప సర్పంచ్ సుంకిశాల సంపత్‌రావు, ఎంపీటీసీ గొల్లె రాజ్యలక్ష్మి, మాజీ ఉప సర్పంచ్ వేణుమాధవరావు, సింగిల్‌విండో డైరెక్టర్ తోట తిరుపతి, ఏఎంసీ డైరెక్టర్ అనితకుమార్, వార్డుసభ్యురాలు సుజాత, మాజీఎంపీటీసీ సుధాకర్, బీఆర్‌ఎస్ యూత్ మండల అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాస్, రవీందర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు. తాహెర్‌కొండాపూర్, బహదూర్‌ఖాన్‌పేట గ్రామాల్లో జీకే యూత్ గౌరవ అధ్యక్షుడు గంగుల ప్రదీప్ బీఆర్‌ఎస్‌కు ఓటేయాలని కోరుతూ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు బుర్ర తిరుపతిగౌడ్, సర్పంచ్ తప్పెట్ల భూమయ్య, ఉప సర్పంచ్ శంకరయ్య, జీకే యూత్ జిల్లా అధ్యక్షుడు ఎం.వెంకట్, మండల అధ్యక్షుడు జక్కు అజయ్‌గౌడ్, నాయకులు రాజు, మారుతి, లక్ష్మణ్, అంజనేయులు, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్‌ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలి



ఇంటింటి ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

కరీంనగర్‌టౌన్:రేకుర్తిలో శక్తి కేంద్రం ఇన్‌చార్జి జాడి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ అసెంబ్లీ అభ్యర్థి, ఎంపీ బండి సంజయ్‌కి ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని గురువారం రేకుర్తిలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జాడి బాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చారని, ఎంపీ బండి సంజయ్ కరీంనగర్‌కు స్మార్ట్‌సిటీ కింద రూ.600 కోట్ల నిధులు తీసుకువచ్చి నగర అభివృద్ధికి సహకారాన్ని అందిస్తున్నారని తెలిపారు. ప్రజలు అభివృద్ధిని గమనించి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పరమేశ్వర గురుస్వామి, మధుసూదన్‌రెడ్డి, మునీందర్‌రెడ్డి, దుర్గం శ్యాంసుందర్, లక్ష్మీరాజం, చంద్రకాంత్, కాలనీవాసులు పాల్గొన్నారు.

మైనార్టీలకు న్యాయం చేసేది కాంగ్రెస్సే



కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

కరీంనగర్‌కార్పొరేషన్: మైనార్టీలకు న్యాయం చేసేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని ఆ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ తాజొద్దీన్ అన్నారు. నగరంలోని హుస్సేనిపుర, కాశ్మీర్‌గడ్డ ప్రాంతాల నుంచి బీఆర్‌ఎస్, ఎంఐఎం నాయకులు పలువురు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. డీసీసీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలతో ప్రజలంతా పార్టీ వైపు నడుస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్, ఎంఐఎం నాయకులు రెహనా, సిరాజ్ మహమ్మద్, అబ్దుల్ సిరాజ్, నూరుద్దీన్ తదితరులు కాంగ్రెస్‌లో చేరిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మైనార్టీ నాయకులు సయ్యద్ అఖిల్, సోహెల్ అహ్మద్, లాయిక్, అబ్దుల్ కరీం, ఫిరోజ్, కలీం, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

4న ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

కరీంనగర్: నగరంలోని పద్మనాయక కల్యాణ మండపంలో ఈనెల 4న భవన నిర్మాణ రంగం, హమాలీ సంఘం ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గురువారం సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాబోయే రోజుల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడబోతుందని, తప్పకుండా కార్మికులకు జరిగే విధంగా సీఎం కేసీఆర్ చూస్తారని అన్నారు. ఆత్మీయ సమ్మేళనంలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో భవన నిర్మాణరంగం జిల్లా అధ్యక్షుడు ఆకుల మల్లేశం, హమాలీ రంగం జిల్లా అధ్యక్షులు కొమిరె రాఘవులు, సంఘం నాయకులు ఇరుకుల్ల బాబు, కొమురయ్య, దుబ్బాసి హనుమంతరావు, వెంకన్న, కవ్వంపల్లి రాజగోపాల్, లింగంపల్లి శంకరయ్య, ఇమ్రాన్, ప్రభు, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

సమాధుల పండుగ



కరీంనగర్‌కల్చరల్: నగరంలోని క్రైస్తవులు చనిపోయిన తమవారిని జ్ఞాపకం చేసుకుంటూ గురువారం మంచిర్యాలచౌరస్తా, రేకుర్తిలోని సమాధులలో ప్రార్థనలు చేశారు. తమవారి సమాధులను శుభ్రపర్చి పూలు చల్లి కొవ్వొత్తులు వెలిగించారు. కేథిడ్రల్ పాస్టరేట్ చైర్మన్ రేవ ఆర్.పాల్ కొమ్మాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అనేకులు వచ్చి తమవారిని జ్ఞాపకం చేసుకొని నివాళి అర్పించారు. కార్యక్రమానికి కేథిడ్రల్ కమిటీ సెక్రెటరీ దేవదాస్, ట్రెజరర్ నెల్సన్, ప్రాపర్టీ సెక్రెటరీ వినయ్‌కుమార్ ఏర్పాట్లు చేశారు.

మంత్రి పరామర్శ



బావుపేటలో పరామర్శిస్తున్న మంత్రి కమలాకర్

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం బావుపేట గ్రామానికి చెందిన దూలం వెంకటేశ్ తల్లి, కదారి లక్ష్మణ్‌ల తండ్రి ఇటీవల మృతి చెందగా.. గురువారం రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. మంత్రి వెంట కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు సాబీర్ పాషా, బీఆర్‌ఎస్ నాయకులు పిల్లి మహేశ్, సుధాకర్ తదితరులు ఉన్నారు.